సాక్షి జగిత్యాల
గురువారం । 13 । ఏప్రిల్ । 2023



ట్రెసా ఆధ్వర్యంలో ఇఫ్తార్

జగిత్యాల: ట్రెసా ఆధ్వర్యంలో బుధవారం ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. కలెక్టర్ యాస్మిన్‌బాషా, అదనపు కలెక్టర్ లత హాజరయ్యారు.



సాంకేతిక పరిజ్ఞాన వేడుకలు

కొండగట్టు : నాచుపల్లి జేఎన్టీయూలో సాంకేతిక పరిజ్ఞాన వేడుకలు ప్రారంభమయ్యాయి. విద్యార్థులు ప్రాజెక్టులు తయారు చేశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
40.0/26.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటిపూట ఉక్కపోతగా ఉంటుంది. ఎండ తీవ్రత పెరిగే అవకాశం ఉంది.

కోపం, ఆవేశం వచ్చినప్పుడు మౌనంగా ఉండడం ఉత్తమం
– మహ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
గురు 6.36	శుక్ర 4.34

రంజాన్ వేళలు

దారిలేదు.. మురుగు ఆగదు

- గోదావరి నదిలో స్నానాలకు భక్తుల ఇబ్బందులు
- పారిశుధ్యం నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ అవసరం
- శాశ్వత పరిష్కారంపై దృష్టి సారించాలని విన్నపం



దారి సౌకర్యం లేక బండరాళ్లపై నుంచి నీటిపాయల వరకు నడుచుకుంటూ వెళ్తున్న భక్తులు

ధర్మపురి: నృసింహుని సన్నిధిలోని గోదావరి పవిత్రతకు మురుగునీరు ఆటంకం కలిగిస్తోంది. అందులో పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తులకు దారి సౌకర్యంలేక అవస్థలు ఎదుర్కోవాల్సి వస్తోంది. నదిని ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉంచేందుకు స్థానిక మున్సిపల్ అధికార యంత్రాంగం ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటున్నా.. శాశ్వత పరిష్కారంపై దృష్టి సారిస్తేనే ప్రయోజనం కలుగుతుందని పలువురు భక్తులు అభిప్రాయపడుతున్నారు.

వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది..

- ప్రముఖ పుణ్యక్షేత్రం ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దర్శనం కోసం వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు నిత్యం వస్తూ ఉంటారు.
- ఇక్కడ గోదావరి నది దక్షిణ ముఖంగా ప్రవహిస్తోంది.
- అందుకే దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందింది.
- ఈ నదిలో స్నానాలు ఆచరిస్తే పుణ్యఫలం లభిస్తుందని భక్తులు నమ్ముతారు.
- ఆ తర్వాత పట్టణంలోని శ్రీలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకుంటారు.

పేరుకుపోతున్న చెత్తాచెదారం.. తొలగిస్తున్న సిబ్బంది..

గోదావరి నది పవిత్రతను కాపాడేందుకు ధర్మపురి మున్సిపల్ అధికారులు శతవిధాలా ప్రయత్నాలు చేస్తున్నారు. మాలలు ధరించిన భక్తులు నిత్యం గోదావరి నదిలో వాటిని వదిలేస్తూ ఉంటారు. వాటిని సిబ్బందితో తరచూ తొలగిస్తున్నారు. అంతేకాదు.. దేవుళ్ల, ఇతర ఫొటోలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, గాజుముక్కలు తొలగిస్తూ నది పరిశుభ్రత కాపాడుతున్నారు. ఇందుకోసం రెండు ట్రాక్టర్లు వినియోగిస్తున్నారు. గోదావరి పుష్కరాలు, నృసింహుని బ్రహ్మోత్సవాల సందర్భంగా చెత్తాచెదారం భారీఎత్తున పేరుకుపోతోంది. ఆ సమయాల్లో సుమారు 120 మంది ప్రత్యేక పారిశుధ్య సిబ్బందిని నియమిస్తూ పనులు చేపడుతున్నారు. ఇందుకోసం పట్టణ ప్రగతి ద్వారా రూ.5లక్షల వరకు వెచ్చిస్తున్నారు. సాధారణ రోజుల్లో రోజూ ఏడుగురు సిబ్బందితో పారిశుధ్య పనులు చేపడుతున్నారు.

గోదావరిలో మురుగునీరు..

గోదావరిలో మురుగునీరు చేరుతోందని, తద్వారా భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయని భావించిన మంత్రి కొప్పుల ఈశ్వర్.. సమస్యను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రూ.7కోట్ల వ్యయంతో మహాడ్రైనేజీ నిర్మాణం చేపట్టారు. వివిధ ప్రదేశాల నుంచి వస్తున్న మురుగునీటిని మహాలక్ష్మీ ఘాట్ వద్ద నిల్వచేసి మురుగు నీటి శుద్ధి కేంద్రం నిర్మించాలని భావించారు. ఇందుకోసం రూ.10కోట్లు మంజూరు చేశారు. టెండర్లు పూర్తయినా పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఫలితంగా మురుగునీరు గోదావరి నదిలో కలిసి భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయి.



ధర్మపురిలో తగ్గుముఖం పట్టిన గోదావరి

తగ్గిన ఎల్లంపల్లి బ్యాక్‌వాటర్

ధర్మపురి సమీప గోదావరి నది దిగువన ఎల్లంపల్లి ప్రాజెక్టు ఉంది. దాని బ్యాక్ వాటర్‌తో నదిలో ఎల్లప్పుడూ నీరు సమృద్ధిగా ఉంటుంది. ప్రస్తుతం వేసవి కావడంతో ఎండ తీవ్రతతో బ్యాక్‌వాటర్ నీటి మట్టం తగ్గుతోంది. దీంతో భక్తులు మండుటెండలో గోదావరి నదిలోకి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా.. పారే నీటిలో స్నానాలు ఆచరిస్తూ శ్రీలక్ష్మీనృసింహస్వామివారిని దర్శించుకుంటున్నారు.

పేరుకుపోయిన బురద..

మొన్నటిదాకా పుష్కరఘాట్లను ఆనుకుని ప్రవహించిన నీరు.. ప్రస్తుతం తగ్గుముఖం పడుతోంది. దీంతో తీరం నుంచి చాలాదూరంలో, లోతులో నీరు పారుతోంది. అంతదూరం వెళ్లి స్నానాలు చేయడం భక్తులకు ఇబ్బందిగా మారింది. ప్రధానంగా సంతోషిమాతా, మంగళిగడ్డ ఘాట్ల ఎదుట బురద, మట్టి పేరుకుపోయింది. దీంతో నీటి నిల్వలు ఉన్న ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు భక్తులకు వీలుకావడంలేదు.

బట్టలు మార్చుకునేందుకు ఇబ్బంది



మంచి రోజులున్నప్పుడు గోదావరిలో స్నానాలు జేసేందుకు వస్తుంటం. ఇప్పుడు నదిలో నీటిపాయ దూరంగా ఉంది. ఆడోళ్లు బట్టలు మార్చుకునేందుకు చాలా ఇబ్బందులు ఉన్నయి. ఇంతకుముందు పుష్కరఘాట్ వద్ద గదులు ఉండేవి. స్నానాలు చేసే ప్రాంతాల్లోనే గదులు ఏర్పాటు చేయాలె. మంచినీటి వసతి కల్పించాలె.
– సత్తవ్వ, భక్తురాలు, చింతగూడ

తొవ్వలేదు



గోదావరి నదిలో పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగాలి. హన్మాన్ స్వాములు పడేసే దుస్తులు, ప్లాస్టిక్ కవర్లు, చెత్తాచెదారం వెనువెంటనే తొలగించాలి. ముఖ్యంగా భక్తులు నీటినిల్వల వరకు వెళ్లడానికి తొవ్వ నిర్మించాలి. గిట్లయితేనే అక్కడిదాకా భక్తులు వెళ్లి సులభంగా పుణ్యస్నానాలు చేస్తరు. ఈ దిశగా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలె. భక్తుల మనోభావాలు కాపాడాలె.
– రమేశ్, భక్తుడు, కొల్వాయి

నిరంతరంగా పనులు



గోదావరి నది పవిత్రత కాపాడేందుకు నిరంతరం పారిశుధ్య పనులు చేపడుతున్నాం. ప్రధాన వేడుకల సందర్భంగా ప్రత్యేక సిబ్బందిని నియమిస్తున్నాం. ప్రస్తుతం సిబ్బంది కొరత ఉన్నా.. రోజూ ఏడుగురు సిబ్బందితో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నాం. భక్తులకు తాగునీరు అందించేందుకు రెండుబోర్ల మరమ్మతు చేపట్టాం.
– రమేశ్, మున్సిపల్ కమిషనర్, ధర్మపురి

న్యూస్‌రీల్

వేడుకలకు తరలిరండి

జగిత్యాలటౌన్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని ఈనెల 14న స్థానిక తహసీల్ చౌరస్తాలో నిర్వహిస్తామని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించే వేడుకలకు జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, దళిత, బీసీ మహిళా, విద్యార్థి సంఘాలు అధిక సంఖ్యలో హాజరు కావాలని విజ్ఞప్తి చేసింది.

జీవన్‌రెడ్డికి ఆహ్వానం

కాగా, అంబేడ్కర్ జయంతికి హాజరు కావాలని కోరుతూ ఉత్సవ కమిటీ సభ్యులు బండ శంకర్, దుర్గయ్య, దుమాల రాజ్‌కుమార్, కారంగుల వసంతరావు, చిత్తారి ప్రభాకర్, మాజీ ఎంపీపీ ధర రమేశ్ స్థానిక ఇందిరా భవన్‌లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందజేశారు.

పంచాయతీ కార్యదర్శుల సంబురాలు



కార్యదర్శికి మిఠాయి తినిపిస్తున్న వసంత

జగిత్యాలజోన్: తాము విధుల్లో చేరి నాలుగేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా గ్రామపంచాయతీ కార్యదర్శులు జిల్లా కేంద్రంలో బుధవారం సంబురాలు జరుపుకున్నారు. తొలుత జగిత్యాల నియోజకవర్గంలోని పంచాయతీ కార్యదర్శులు జెడ్పీ చైర్ పర్సన్ దావ వసందను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె కేక్ కట్ చేసి కార్యదర్శులకు మిఠాయిలు తినిపించారు. వారికి శుభాకాంక్షలు తెలిపారు.

మహిళా న్యాయవాదులకు ప్రత్యేక గది కేటాయించండి



శ్రీపాల్‌రెడ్డితో మహిళా న్యాయవాదులు

జగిత్యాలజోన్: తమకు కోర్టులో ప్రత్యేక గది కేటాయించాలని పలువురు మహిళా న్యాయవాదులు కోరారు. బుధవారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాటిపెల్లి శ్రీపాల్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. కోర్టులో దాదాపు 20 మంది వరకు మహిళా న్యాయవాదులు ఉన్నారని వారు తెలిపారు. కేసుల విచారణ మధ్యలో స్వల్ప విశ్రాంతి తీసుకునేందుకు ప్రత్యేక గది అవసరం ఉందని చెప్పారు. అయితే, అవకాశాలను పరిశీలిస్తానని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చీటి రామకృష్ణారావు, కోశాధికారి కటుకం చంద్రమోహన్, న్యాయవాదులు మదన్‌మోహన్, వినోద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్‌కు ఎంపిక



కౌశిక్‌కు సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రాయికల్(జగిత్యాల): భూపతిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి బందెల కౌశిక్ రుక్మాపూర్ సైనిక్ పాఠశాలకు ఎంపికయ్యాడు. ఇంటర్మీడియెట్ కోర్సులో చేరేందుకు అర్హత సాధించాడని ప్రధానోపాధ్యాయుడు లక్ష్మయ్య, విద్యాకమిటీ చైర్మన్ జక్కుల రాజేంద్రప్రసాద్ బుధవారం తెలిపారు. కౌశిక్ ను ఉపాధ్యాయులు దాసరి రామస్వామి, సిరిపురం మహేశ్, శంకరయ్య, కల్వకోట కార్తీక్, గిరిధర్, తిరుమల, బందెల శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

నియామకం



రాము

జగిత్యాలటౌన్: బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఒంటిపులి రామును నియమించారు. ఈమేరకు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బ్రహ్మండభేరి నరేశ్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజాల శ్రీనివాస్‌గౌడ్ ఆదేశాల మేరకు పట్టణానికి చెందిన ఒంటిపులి రామును సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించినట్లు ఆయన వివరించారు.

ధాన్యం నిల్వలకు కాంట్రాక్టర్లే బాధ్యులు



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్‌బాషా

జగిత్యాలఅగ్రికల్చర్: ప్రతీ ధాన్యం కొనుగోలు కేంద్రానికి రవాణా కాంట్రాక్టర్లు రెండు లేదా అంతకంటే ఎక్కువ లారీలు అందుబాటులో ఉంచాలని, తూకం వేశాక ధాన్యం నిల్వ ఉంటే వారే బాధ్యత వహించాలని కలెక్టర్ యాస్మిన్ బాషా హెచ్చరించారు. యాసంగి ధాన్యం కొనుగోళ్లపై తన కార్యాలయంలో బుధవారం ఆమె అధికారులతో సమీక్షించారు. ఈసారి సుమారు 5.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని, ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 419 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, సాధ్యమైనంత త్వరగా కొనుగోళ్లు పూర్తిచేస్తామని చెప్పారు. ఇందుకోసం గోనె సంచులు సిద్ధంగా ఉన్నాయని అన్నారు. నిబంధనల మేరకు ధాన్యాన్ని తూర్పార బట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని రైతులకు సూచించారు. ధాన్యం అన్‌లోడ్ చేసేందుకు రైస్‌మిల్లర్లు హమాలీలను సిద్ధంగా ఉంచుకోవాలని కోరారు. ధాన్యం అన్‌లోడ్ చేయడంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా మిల్లర్లే బాధ్యత వహించాల్సి ఉంటుందని చెప్పారు. ఇప్పటికే మరఆడించిన బియ్యాన్ని అప్పగించడంలో నిర్లక్ష్యం చూపుతున్న మిల్లర్లు.. త్వరగా బియ్యాన్ని అందజేయాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత తదితరులు పాల్గొన్నారు.

బాలుడి కిడ్నాప్ కలకలం

పెగడపల్లి(ధర్మపురి): బతికెపల్లిలో బుధవారం ఓ బాలుడి కిడ్నాప్ యత్నం కలకలం సృష్టించింది. గ్రామానికి చెందిన మడిగెల శ్రీను – స్వప్న దంపతుల కుమారుడు పవన్‌కుమార్ ఓ స్కూల్‌లో మూడో తరగతి చదువుతున్నాడు. రోజూమారిగానే ఉదయం ఇంటి నుంచి బయలు దేరాడు. ఈక్రమంలో బైక్‌పై మాస్క్ ధరించిన గుర్తుతెలియని వ్యక్తి వచ్చి చాక్లెట్ ఇచ్చి తాళ్లతో బంధించి వెళ్లిపోయాడు. కాసేపటికి అటుగా వచ్చిన స్థానికులు గమనించి తాళ్లు విప్పారు. బాలుడి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వారు బాలుడి వద్దకు చేరుకుని తమతో తీసుకెళ్లారు. ఈ విషయంపై పోలీసులకు సమాచారం అందించారు. దీనిపై ఎస్సై కుమారస్వామిని వివరణ కోరగా.. బాలుడి కిడ్నాప్ యత్నంపై కేసు నమోదు చేశామన్నారు. బాలుడిని గ్రామస్తులు బంధించారా? లేక కిడ్నాపర్లు ఈ పనిచేశారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

పదోన్నతులు లేవు!



దుంపేట ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో పాఠం బోధిస్తున్న ఉపాధ్యాయుడు

- టీచర్ల బదిలీలు కావు
- జూన్ 13కు కేసు వాయిదా
- నైరాశ్యంలో ఉపాధ్యాయులు
- జిల్లాలో ఖాళీలు 1,570

ప్రస్తుతం, లాంగ్ స్టాండింగ్‌తో కలిపి జిల్లాలో ఉపాధ్యాయ ఖాళీల వివరాలు

పోస్టులు	ఖాళీలు
గెజిటెడ్ హెడ్మాస్టర్	140
ఎస్‌ఏ(గణితం)	95
ఎస్‌ఏ(భౌతికశాస్త్రం)	69
ఎస్‌ఏ(జీవశాస్త్రం)	77
ఎస్‌ఏ(సాంఘికశాస్త్రం)	108
ఎస్‌ఏ(ఇంగ్లిష్)	82
ఎస్‌ఏ(తెలుగు)	48
ఎస్‌ఏ(హిందీ)	23
ఎస్‌ఏ(ఉర్దూ)	02
పీడీ	07
ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం	118
లాంగ్వేజ్ పండిత్(తెలుగు)	50
లాంగ్వేజ్ పండిత్(హిందీ)	64
లాంగ్వేజ్ పండిత్(ఉర్దూ)	02
పీఈటీ	13
ఎస్జీటీ	672
మొత్తం	1,570

కథలాపూర్(వేములవాడ): ఉపాధ్యాయుల బదిలీల కేసు జూన్ 13వ తేదీకి వాయిదా వేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీచేయడంతో ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో మరింత జాప్యం జరిగే అవకాశం ఉందని టీచర్లు నిరాశ చెందుతున్నారు. సుమారు ఎనిమిదేళ్ల అనంతరం పదోన్నతులకు పచ్చజెండా ఊపడం, నాలుగేళ్ల తర్వాత బదిలీలకు అవకాశం కల్పిస్తూ ఈ ఏడాది జనవరిలో ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయడంతో ఉపాధ్యాయుల్లో ఆనందం వ్యక్తమైంది. ఇందుకోసం వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే ప్రక్రియ ముగిసింది. తీరా పలువురు ఉపాధ్యాయులు హైకోర్టును ఆశ్రయించడంతో అప్పట్లో స్టే విధించిన విషయం తెలిసిందే. తమకు అవకాశం ఎన్నాళ్లకు వస్తుందోనని వారు దిగులు చెందుతున్నారు.

బదిలీలకు 2,370 మంది దరఖాస్తు..

- జిల్లాలో ఐదు మున్సిపాలిటీలు, 20 మండలాలు ఉండగా.. 380 గ్రామాలు ఉన్నాయి.
- ఇందులో 511 ప్రభుత్వ ప్రాథమిక, 85 ప్రాథమికోన్నత, 187 జెడ్పీ హైస్కూళ్లు ఉన్నాయి.
- ఆయా పాఠశాలల్లో 3,280 మంది ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారు.
- బదిలీల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఈ ఏడాది జనవరి 27 నుంచి అవకాశం కల్పించగా.. జిల్లాలో 2,370 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు.
- వీరి బదిలీలపై ఫిబ్రవరి 14న హైకోర్టు స్టే ఇస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

భార్యాభర్తలు ఒకేచోట ఉండాలి



మా స్వగ్రామం రాయికల్ మండలం ఇటిక్యాల. నేను, మా ఆవిడ ఇద్దరమూ ఉపాధ్యాయులమే. ఇద్దరం ఒకేచోట నివాసం ఉంటే మానసిక ప్రశాంతతో ఉంటాం. హడావుడిగా కాకుండా ఉత్సాహంగా విధులకు హాజరయ్యే అవకాశం ఉంటుంది. ఫలితంగా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు సాధిస్తాం. కుటుంబ కలహాలు తగ్గుతాయి. స్పౌజ్ కేటగిరీలో ప్రభుత్వం ఇచ్చిన సదుపాయాలు వెనక్కి తీసుకోవద్దు.
– సీహెచ్ విష్ణు, ఎస్జీటీ, భూషణరావుపేట

చిత్తశుద్ధి లోపమే కారణం



టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు ఉన్నాయని ప్రభుత్వం అప్పట్లో హడావుడిగా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల నోటిఫికేషన్ జారీచేసింది. అవి పూర్తికావడంతో బదిలీలు, పదోన్నతుల గురించి పట్టించుకోవడంలేదు. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదు. చిత్తశుద్ధితో కోర్టుకు సరైన సమాధానం ఇస్తే వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు పూర్తవుతాయి.
– గుజ్జెటి కృష్ణారావు, డీటీఎఫ్ నాయకుడు

కౌంటర్ దాఖలు చేయాలి



ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించినవి గతంలో అనుసరించిన మార్గదర్శకాలే ఇప్పుడున్నవని అందరికీ తెలుసు. ప్రభుత్వం ఉపాధ్యాయుల సంక్షేమం కోరుకుంటే వెంటనే కోర్టులో కౌంటర్ దాఖలు చేయాలి. ఉపాధ్యాయులతో అనుకూల వైఖరితో వ్యవహరించి కాలయాపన చేయకుండా ఈ వేసవి సెలవుల్లోనే ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి.
– కొమురయ్య, టీఎస్టీయూ నేత

ప్రభుత్వ ఆదేశాలు పాటిస్తాం



ఉపాధ్యాయుల బదిలీల విషయంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు అప్పట్లో దరఖాస్తులు స్వీకరించి పరిశీలన చేశాం. ప్రభుత్వ తదుపరి నిర్ణయం మేరకు ముందుకు వెళ్తాం.
– జగన్మోహన్‌రెడ్డి, డీఈవో

ఇథనాల్ పరిశ్రమకు నిరసన సెగ



కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్తున్న వెల్గటూర్ మండల ప్రజలు(ఫైల్)

- రూ.750కోట్ల అంచనా వ్యయంతో స్థాపనకు శ్రీకారం
- కర్మాగారం ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఏకమవుతున్న గ్రామాలు
- వాతావరణ, భూగర్భ జలాలు కలుషితమవుతాయని ఆందోళన

వెల్గటూర్(ధర్మపురి): స్తంభంపల్లి – పాశిగామ గ్రామాల మధ్య సుమారు రూ.750 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే ఇథనాల్ రైస్‌బ్రాన్ ఆయిల్ పరిశ్రమ స్థాపనకు ఆదిలోనే అడ్డంకులు ఎదురవుతున్నాయి. ధర్మపురి నియోజకవర్గంలో అతిపెద్ద ప్రాజెక్టు ఇదే కావడంతో మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పరిశ్రమ ఏర్పాటుకు అన్నిఅనుమతులు తీసుకొచ్చారు. వేలాది మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని భావిస్తుండగా.. పరిశ్రమ వెదజల్లే వ్యర్థాలతో భూగర్భ జలాలు కలుషితమవుతాయని, పంటలు దెబ్బతింటాయని, సమీప ఎల్లంపల్లి ప్రాజెక్టు మనుగడ ప్రశ్నార్థకమవుతుందని గ్రామస్తులు కొద్దిరోజులుగా ఆందోళనలు చేస్తున్నారు.

110 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు..

- స్తంభంపల్లి శివారు సర్వే నంబర్ 1090లో క్రిశాక్ భారతీ కో ఆపరేటివ్ లిమిటెడ్(క్రిబ్‌కో), రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా సుమారు 110 ఎకరాల్లో ఇథనాల్ రైస్‌బ్రాన్ ఆయిల్ పరిశ్రమ స్థాపించేందుకు నిర్ణయం తీసుకున్నాయి.
- రోజూ 2.5 లక్షల లీటర్ల ఇథనాల్ ఉత్పత్తి సామర్థ్యంతో పరిశ్రమ ఏర్పాటు చేస్తున్నారు.
- 2023 మార్చి 31న రూ.13 కోట్ల అంచనా వ్యయంతో పరిశ్రమకు కేటాయించిన స్థలం చదును చేయడానికి మంత్రి కొప్పుల ఈశ్వర్ భూమిపూజ చేశారు.

మంత్రి ఇచ్చిన హామీలు ఇవీ..

ఇథనాల్ పరిశ్రమ కోసం గతంలో కేటాయించిన స్థలంలో మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల హాస్టల్ భవనం, 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రి భవనం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం, అంబేడ్కర్ భవన్ నిర్మాణాలకు మంత్రి కొప్పుల ఈశ్వర్ హామీ ఇచ్చారు. అంతేకాదు.. బుద్ధ విగ్రహం ఏర్పాటు చేస్తాని చెప్పారు. అవన్నీ పక్కన పెట్టిన మంత్రి.. ఇప్పుడు ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు చేయడం ఏమిటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

చారిత్రక ఆనవాళ్లకు ప్రమాదం..

- ఇథనాల్ కర్మాగారం ప్రతిపాదిత స్థలంలో క్రీస్తుకు పూర్వం సుమారు 2వ శతాబ్దానికి చెందిన అతి ప్రాచీన బౌద్ధస్థూపం ఉండేదని చరిత్రకారులు చెబుతున్నారు.
- 1999లో ఇర్కాన్ సంస్థ రోడ్డు విస్తరణ కోసం గుట్టకు మట్టితీసే క్రమంలో స్థూపం కనుమరగైందని అంటున్నారు.
- స్థూపం శిథిలాలు ప్రస్తుతం కరీంనగర్‌లోని మ్యూజియంలో భద్రంగా ఉన్నాయి.
- ప్రాజెక్టు ప్రతిపాదిత స్థలానికి సుమారు మూడు కి.మీ. దూరంలో శాతవాహనులు పాలించిన కోటిలింగాల క్షేత్రం ఉంది.
- గతంలో చేపట్టిన తవ్వకాల్లో వారికి సంబంధించిన అనేక అవశేషాలు బయల్పడ్డాయి.
- ఇంతటి చారిత్రక నేపథ్యం ఉన్న స్తంభంపల్లి – పాశిగామ శివారు ప్రాంతంలో ఇథనాల్ పరిశ్రమ స్థాపిస్తే చరిత్ర కనుమరుగవుతుందని చరిత్రకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాభిప్రాయం తీసుకోవాలి

ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణంతో గాలి, నీరు, భూగర్భ జలాలు కలుషితమై దుష్ఫలితాలు వెలువడుతాయి. ఇలాంటి ఫ్యాక్టరీ జనావాసాల్లో ఏర్పాటు చేసే ముందు ప్రజాభిప్రాయం తీసుకోకుండా అనుమతులు ఎలా ఇస్తారు? ప్రజలు వ్యతిరేకిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేయాలి.
– గొంటి కిరీటి, న్యాయ విద్యార్థి, స్తంభంపల్లి

హాస్టల్ నిర్మించాలి

జనావాసాల మధ్య కాలుష్యం వెదజల్లే పరిశ్రమ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్నాం. మంత్రి హామీ మేరకు గురుకుల హాస్టల్, వంద పడకల ఆస్పత్రి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం నిర్మించాలి. ప్రభుత్వం మొండిగా వ్యవహరించి పరిశ్రమ నిరిస్తే.. మా ప్రాణాలు పోయినా అడ్డుకుంటాం.
– గోపతి నరేశ్, గ్రామస్తుడు, పాశిగామ

క్లుప్తంగా

జగిత్యాల సీఐగా రాం చందర్‌రావు


ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఐ రాంచందర్ రావు

జగిత్యాలక్రైం : జగిత్యాల పట్టణ సీఐగా రాం చందర్‌రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సీఐ కిషోర్ ఇటీవల ఐజీకి బదిలీకాగా, జమ్మికుంట పట్టణ సీఐగా పనిచేస్తున్న రాంచందర్‌రావు పట్టణ సీఐగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

కుట్టుమిషన్లు చోరీ


వివరాలు సేకరిస్తున్న ఎస్‌ఐ సందీప్

జగిత్యాల క్రైం : జిల్లా కేంద్రంలోని రెండు ప్రభుత్వ పాఠశాలల్లో గుర్తు తెలియని వ్యక్తులు కుట్టుమిషన్లు, ఆట వస్తువులను ఎత్తుకెళ్లారు. పోర్ట్ హైస్కూల్ ఉర్దూ మీడియం, తీన్‌ఖని చౌరస్తాలోని న్యూ హైస్కూల్‌లో మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కిటికీలు, వెంటిలేటర్లు పగులగొట్టి లోపలికి చొరబడ్డారు. పోర్ట్ హైస్కూల్ ఉర్దూ మీడియంలో భద్రపర్చిన 7 కుట్టుమిషన్లు, విద్యార్థుల ఆట వస్తువులను ఎత్తుకెళ్లారు. ఉపాధ్యాయులు గమనించి బుధవారం పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ సందీప్ ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. ఉపాధ్యాయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

వ్యాసరచన పోటీలు

రామగిరి(మంథని): సింగరేణి సంస్థ ఆర్జీ–3, ఏపీఏ ఆధ్వర్యంలో బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతిని పురస్కరించుకొని సెంటినరీకాలనీలోని వివిధ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు దేశానికి, సమాజానికి అంబేడ్కర్ అందించిన సేవలు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు ఈ నెల 14న నిర్వహించనున్న అంబేడ్కర్ జయంతి వేడుకల్లో బహుమతులు అందజేయనున్నారు.

విజేతలు వీరే..

కృష్ణవేణి టాలెంట్ స్కూల్ నుంచి అమూల్య, అక్షయ, దేవర్షిణి, వాణీ సెకండరీ స్కూల్ నుంచి జశ్వంత్, సాత్విక్, శ్రీవర్ష, హిల్‌పోర్ట్ హైస్కూల్ నుంచి శ్రీవల్లి, చరణ్‌రాజ్, విక్రమ్ తేజ, ప్రగతి హైస్కూల్ నుంచి అఖిల, రామ్‌చరణ్, అఖిల ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు.

ఇటు కల్లు.. అటు నీరా..

- అంతర్గాం గీత కార్మికులకు ఫుల్ డిమాండ్
- ఎనిమిది ఎకరాల్లో ఈత చెట్ల పెంపకం
- స్టాళ్ల ద్వారా విక్రయించే ఆలోచన


ఈత చెట్టు నుంచి కల్లు గీస్తున్న గీత కార్మికుడు


అంతర్గాంలో గీత కార్మికులు పెంచిన ఈతవనం

జగిత్యాల అగ్రికల్చర్ : గ్రామాల్లో ఈత, తాటిచెట్ల కల్లును అమ్ముకుంటూ గీత కార్మికులు జీవనోపాధి పొందుతున్నారు. బీరు, బ్రాండీ, విస్కీ వంటి మద్యం గ్రామాల్లోకి రావడంతో ఉపాధికి ఇబ్బందిగా మారింది. దీనికి తోడు పల్లెల్లో ఈత, తాటి చెట్లు తగ్గుతుండటంతో పాటు కల్లుగీసే చెట్లకు రక రకాల తెగుళ్లు సోకి, కల్లు పారడం లేదు, జగిత్యాల రూరల్ మండలంలోని అంతర్గాం గ్రామ గీత కార్మికులు వినూత్న పద్ధతిలో ఈతచెట్లను పెంచి, దాని ద్వారా ఓ వైపు ఈత నీర, మరోవైపు ఈత కల్లు గీస్తూ మిగతా గ్రామాల గీత కార్మికులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

డ్రిప్ ద్వారా పెంపకం..

అంతర్గాం గీత కార్మికులంతా ఐకమత్యంతో వంద మంది సభ్యులు దాదాపు ఎనిమిది ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేశారు. ఆ భూమి ఏళ్ల తరబడి వృథాగా ఉంది. గ్రామంలోని ఈత, తాటి చెట్లు ఎక్కువగా చనిపోయి ఉపాధికి ఇబ్బందిగా మారింది. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు జితేందర్ రావు నేతృత్వంలో గీత కార్మికులు వివిధ ప్రాంతాల్లోని ఈతవనాలు సందర్శించి, వృథా భూమిలో సంగారెడ్డి నర్సరీ నుంచి దాదాపు 5వేల ఈత మొక్కలను తెచ్చి నాటారు. వీటికి డ్రిప్ ద్వారా నీరు, పేడవంటి సేంద్రియ ఎరువులను మొక్కలకు అందించారు. ఏటా చెట్ల కొమ్మలు భూమి మీదకు రాకుండా, ప్రూనింగ్ చేస్తారు. ఐదేళ్లలోనే ఈతవనం ఏపుగా పెరిగి కల్లు గీసేందుకు వీలుగా ఉంది.

నాలుగు వేల చెట్లు గీసేందుకు సిద్ధం..

ఈత వనంలోని దాదాపు 4వేల చెట్ల వరకు కల్లు గీతకు రావడంతో సంఘంలోని సభ్యులు కల్లు గీతకు తలకొన్ని ఈత చెట్లు పంచుకున్నారు. రోజూ ఒక్కోచెట్టుకు కనీసం 2లీటర్ల కల్లు పారేలా చూసుకుంటూ కనీసం 1000–1500 లీటర్ల కల్లును ఉత్పత్తి చేస్తున్నారు. కల్లును అక్కడికక్కడే విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. జగిత్యాల చుట్టుపక్కన గ్రామాల ప్రజలు ఉదయాన్నే కల్లు కోసం అంతర్గాం వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. కల్లు ఉత్పత్తి ఎక్కువై అమ్మలేని పరిస్థితుల్లో ప్రభుత్వ సహకారంతో రానున్న రోజుల్లో ‘పల్లె కల్లు పట్నం’కు పంపాలనే ఆలోచనతో ఉన్నారు. కల్లు ద్వారా ఆదాయం అంతంత మాత్రమే వస్తుండగా గీత కార్మికులు సమావేశమై ఈతనీరాను సైతం అమ్మేందుకు నిర్ణయించుకున్నారు.

నీరా వైపు గీతన్నలు

అంతర్గాంలో కల్లు అయితే లీటర్‌కు రూ.50, ఈత నీరా అయితే లీటర్‌కు రూ.100 వరకు అమ్ముతున్నారు. వేసవిలో చల్లదనానికి ఈతనీరాను తాగుతుంటారు. కొత్త కుండల్లో ఈతనీరాను గీస్తారు. ప్రభుత్వం ఈతనీరాకు అనుమతి ఇవ్వడంతో రెండేళ్ల క్రితం, జిల్లా ఎక్సైజ్ అధికారులు ఈతనీరాను ప్రారంభోత్సవం చేశారు. 15 లీటర్లపైన ఆర్డర్ చేస్తే ఇంటికి కూడా పంపిస్తామంటూ గీత కార్మికులు చెబుతున్నారు. ఈత నీరాతో ఆరోగ్యానికి చాలా ఉపయోగాలు ఉన్నాయని వైద్యులు చెబుతుండటం, ప్రభుత్వం ఈతనీరాకు ప్రాధాన్యం ఇస్తుండటంతో జిల్లా కేంద్రంలో ఉదయం ఓ స్టాల్ ఏర్పాటు చేసి విక్రయించాలని భావిస్తున్నారు.

ఆరోగ్యానికి మంచిది



ఈత నీరా అమ్మకాల ద్వారా ఆదాయం పొందాలనుకుంటున్నాం. కల్లు చాలా గ్రామాల్లో దొరికే అవకాశం ఉన్నందున, అంతర్గాంకు ఈత నీరా బ్రాండ్‌ను ఏర్పాటు చేయబోతున్నాం. ప్రతిఒక్కరూ ఈతనీరా తాగవచ్చు. ఈతనీరా ఆరోగ్యానికి అన్నివిధాలా మంచిది.
– బాలగౌడ్, గీతకార్మిక సంఘం అధ్యక్షుడు, జగిత్యాల

ఇతర గ్రామాలకు ఆదర్శం



అంతర్గాం గౌడ కులస్తులను మెప్పించి ఆధునిక పద్ధతిలో ఈతవనం పెంచాం. ఇప్పుడు, గౌడ కులస్తులకు ఆదాయ వనరుగా మారింది. ఈత వనం ఇతర గ్రామాలకు ఆదర్శంగా మారింది. ఇప్పటికే రాష్ట్రస్థాయి ప్రజాప్రతినిధులతో పాటు పలుగ్రామాల గౌడ కులస్తులు వచ్చి పరిశీలించి వెళ్తున్నారు.
– జితేందర్ రావు, ఈతవనం సృష్టికర్త, అంతర్గాం

ఈత నీరాను ప్రోత్సహిస్తాం



జిల్లాలో ఎక్కడా లేనివిధంగా అంతర్గాం గౌడ కులస్తులు ఈతవనాన్ని పెంచారు. కల్లుతో పాటు ఈతనీరా ఉత్పత్తి అవుతుంది. ఆరోగ్య రీత్యా ప్రభుత్వం సైతం ఈతనీరాను ప్రోత్సహిస్తోంది. ఎవరైనా ఈతనీరాను తాగవచ్చు. మేరకు ఎక్సైజ్ శాఖ తరుపున సైతం ప్రోత్సహిస్తున్నాం.
– శ్రీధర్, ఎక్సైజ్ సూపరింటిండెంట్, జగిత్యాల

చికిత్స పొందుతూ యువతి మృతి

రుద్రంగి (వేములవాడ): మండలంలోని వీరునితండా గ్రామానికి చెందిన గుగులోతు లావణ్య (18) పురుగుల మందు తాగగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చదువుకోవాలని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురై మంగళవారం పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం రుద్రంగికి, అక్కడినుంచి ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి, తర్వాత సిరిసిల్లలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేశామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై ప్రభాకర్ పేర్కొన్నారు.

మహిళ కడుపులోంచి కణతి తొలగింపు

ముస్తాబాద్ (సిరిసిల్ల): అరుదైన శస్త్రచికిత్సతో ఓ మహిళ నుంచి ఐదుకిలోల కణతిని వైద్యులు తొలగించారు. గూడెం గ్రామానికి చెందిన సుబ్బమ్మ (40) కడుపునొప్పితో ముస్తాబాద్‌లో శ్రీ తిరుమల నర్సింగ్ హోంలో చేరింది. గురువారం శస్త్రచికిత్స చేసి ఆమె కడుపులోంచి ఐదు కిలోల కణతిని తొలగించినట్లు వైద్యురాలు అనూష తెలిపారు. వైద్యులు రవికాంత్, రాజేందర్ సబ్బమ్మకు ఆపరేషన్ చేసి ఐదు కిలోల కణితిని తొలగించారని చెప్పారు. దీనిని ఫైబ్రాయిడ్ యూటెరస్‌గా గుర్తించామని, ప్రస్తుతం సుబ్బమ్మ కోలుకుంటున్నట్లు తెలిపారు. మారుమూల పల్లెల్లోని ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నామని పేర్కొన్నారు.

కేసు నమోదు

సారంగాపూర్ : మండలంలోని బట్టపల్లి గ్రామ శివారులోని క్రీడాప్రాంగణ బోర్డును గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై మనోహర్‌రావు తెలిపారు. కార్యదర్శి మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, ధ్వంసం చేసిన వారి వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు.

వెంకటేశ్‌ను అభినందించిన ఎమ్మెల్యే


ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు ఖర్బూజ కాయలు అందిస్తున్న వెంకటేశ్

జగిత్యాల అగ్రికల్చర్ : వినూత్న రీతిలో, వివిధ రకాల ఖర్బూజను సాగుచేస్తున్న సారంగాపూర్ మండలం పెంబట్లకు చెందిన రైతు బండారి వెంకటేశ్‌ను బుధవారం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అభినందించారు. ఆదర్శ సేద్యం కింద ‘నేనే రైతు–నేనే వ్యాపారి’ అనే శీర్షికన బుధవారం సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితం కాగా స్పందించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వెంకటేశ్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్‌కు వెంకటేశ్ ఖర్బూజకాయలను అందజేశాడు. ఆయన వెంట సింగిల్‌విండో చైర్మన్ మల్లారెడ్డి, రైతుబంధు అధ్యక్షుడు బాదినేని వెంకటేశ్, గ్రామస్తులు తేలు రాజు, గంగరాజం, తదితరులు పాల్గొన్నారు.

వర్మీ కంపోస్ట్‌తో అదనపు ఆదాయం

- కలెక్టర్ యాస్మిన్‌బాషా


మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్‌బాషా

ధర్మపురి : వర్మీ కంపోస్ట్ ఎరువు తయారీని పెంచేందుకు కృషిచేయాలని, పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. మండలంలోని వివిధ గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో తయారు చేసిన వర్మీ కంపోస్ట్ ఎరువు బ్యాగులను ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి గ్రామ పంచాయతీలో ఈ విధానాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ వారిని అభినందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మందమకరంద, డీఆర్డీవో, ధర్మపురి మండల ఎంపీవో, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై పడి ఒకరి మృతి

- మృతుడు ఛత్తీస్‌గఢ్‌వాసి
- రామగుండం రైల్వేస్టేషన్‌లో ఘటన


దయాసింగ్ మృతదేహం

రామగుండం: ఉపాధి నిమిత్తం వచ్చి, స్వస్థలానికి వెళ్తున్న ఓ కార్మికుడు ప్రమాదవశాత్తు మృతిచెందిన ఘటన రామగుండం రైల్వేస్టేషన్‌లో చోటుచేసుకుంది. జీఆర్పీ ఔట్‌పోస్టు ఇన్‌చార్జి గంగారపు తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బలరాంపూర్ జిల్లా పరిధి శాంతిపూర్‌కు చెందిన దయాసింగ్(32) జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్మితమవుతున్న మెడికల్ కళాశాలలో సెంట్రింగ్ రాడ్ బెండింగ్ కార్మికుడిగా నెల రోజుల క్రితం విధుల్లో చేరాడు. ఈ నేపథ్యంలో అర్ధరాత్రి ఒంటి గంటకు వచ్చే రాయ్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లో ఇంటికి వెళ్లేందుకు మంగళవారం రాత్రి రామగుండం రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. కానీ రైలు ఎక్కలేదా? లేకపోతే అతను గమనించకపోయేసరికి వెళ్లిపోయిందా తెలియరాలేదు. బుధవారం వేకువజామున రెండో ప్లాట్‌ఫాం పైనుంచి ప్రమాదవశాత్తు పడటంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహం పట్టాల మధ్యలో ఉండటంతో పైనుంచి పలు రైళ్లు వెళ్లినప్పటికీ అలాగే ఉంది. మృతుడి వద్ద బ్యాగులో లభ్యమైన సెల్‌ఫోన్ ఆధారంగా పోలీసులు ఛత్తీస్‌గఢ్‌లోని అతని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య ఇరుమతియాసింగ్, ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నామని జీఆర్పీ ఔట్‌పోస్టు ఇన్‌చార్జి పేర్కొన్నారు.

మామూళ్ల పేరిట వేధింపులు

- నిలిచిన పీహెచ్‌సీ పనులు
- పెచ్చులూడుతున్న భవనంలోనే విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

చందుర్తి (వేములవాడ) : మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన పనులు నిలిచిపోయాయి. అభివృద్ధి పనులు చేయాల్సిన ప్రజాప్రతినిధులే కాంట్రాక్టర్లను మామూళ్ల పేరిట బెదిరింపులకు పాల్పడడంతో సదరు కాంట్రాక్టర్ ఏకంగా పనులు నిలిపివేసినట్లు తెలిసింది. చందుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శిథిలావస్థకు చేరడంతో ఎమ్మెల్యే రమేశ్‌బాబు సహకారంతో నూతన భవన నిర్మాణానికి రూ.1.56 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో భవన నిర్మాణానికి ఫిబ్రవరి 22న ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. పనులు చేసేందుకు కాంట్రాక్టర్ ముందుకొచ్చారు. పదిరోజుల క్రితం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణలో అడ్డంగా ఉన్న చెట్లను తొలగించారు. పనులు మొదలుపెట్టారని తెలుసుకున్న స్థానిక ప్రజాప్రతినిధితోపాటు మండలస్థాయి ప్రజాప్రతినిధి మంజూరైన నిధుల్లోంచి పర్సంటేజీలు డిమాండ్ చేసినట్లు సమాచారం. సదరు ప్రజాప్రతినిధులు ఆస్పత్రి అభివృద్ధి కమిటీలోనూ ముఖ్యులు కావడంతో కాంట్రాక్టర్ ఏమీ చేయలేని పరిస్థితిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆస్పత్రి పాతభవనం పెచ్చులూడి కిందపడుతోంది. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని వైద్యసిబ్బంది భయం భయంగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని బీఆర్‌ఎస్ మండల నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలి

- కలెక్టర్ యాస్మిన్‌బాషాకు వైఎస్సార్‌టీపీ నాయకుల వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జగిత్యాల టౌన్: బిశ్వాల్ కమిటీ నివేదిక ప్రకారం రాష్ట్రంలో ఖాళీగా ఉన్న లక్షా 90 వేల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం నాయకులతో కలిసి కలెక్టర్ యాస్మిన్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. నిరుద్యోగ యువత ఆత్మ బలిదానాలతో ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం నిరుద్యోగుల ఆశలను నీరుకార్చిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నాలుగు లక్షలకు పైగా ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలున్నాయన్నారు. తొమ్మిదేళ్లలో ఎన్ని ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. నిరుద్యోగ సమస్యపై పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నాయకత్వంలో పోరాటం చేస్తామన్నారు. పోటీ పరీక్షల్లో జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీలకు మరింత సహకారాన్ని అందించాలని కోరారు. వినతిపత్రం అందజేసినట వారిలో పట్టణ అధ్యక్షుడు కాముని గంగాధర్, ప్రేమ్‌సాగర్, మమత, రాజమ్మ, తదితరులున్నారు.

కేంద్రం నిధులతోనే రాష్ట్రాభివృద్ధి

- బీజేపీని ప్రజలు ఆదరించాలి
- ఉమ్మడి కరీంనగర్ జిల్లా జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ


తుల ఉమను సన్మానిస్తున్న నాయకులు

మల్లాపూర్ : సీఎం కేసీఆర్ మాటల గారడితో ప్రజలను మోసం చేస్తున్నారని, కేంద్రం అందించే నిధులతోనే రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని, ఉమ్మడి కరీంనగర్ జిల్లా జెడ్పీ మాజీ చైర్ పర్సన్, బీజేపీ రాష్ట్ర నాయకురాలు తుల ఉమ అన్నారు. బుధవారం మండలంలోని గొర్రెపల్లిలో శ్రీ లక్ష్మీవెంకటేశ్వర స్వామి జాతర ఉత్సవాల్లో బీజేపీ రాష్ట్ర నాయకుడు సురభి నవీన్‌కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ అప్పులకుప్పగా మార్చారని విమర్శించారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ప్రజల పక్షాన పోరాటం చేస్తామన్నారు. బీజేపీని గెలిపిస్తే సంక్షేమ పథకాలు రద్దవుతాయని చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దన్నారు. బీఆర్‌ఎస్ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని, నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ముందుకెళ్లాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ముద్దం సత్యనారాయణ గౌడ్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు బైన ప్రశాంత్, నాయకులు కొడిమ్యాల రాజేందర్, మర్రి నందు, గంగుల భూమానంద్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ప్రజా ఉద్యమకారుడి మృతి


లక్ష్మీనారాయణ(ఫైల్)

బుగ్గారం : మండల కేంద్రానికి చెందిన ప్రజా ఉద్యమకారుడు ఏలేశ్వరం లక్ష్మీనారయణ (68) గుండెపోటుతో మృతిచెందారు. కొంతకాలంగా వంద్రంగి వృత్తి చేసుకుంటూ ఇంటివద్దనే జీవిస్తున్నాడు. బుధవారం గుండెపోటు రావడంతో హఠాన్మరణం చెందాడు. ఆయన మృతిపట్లు ప్రముఖ సామాజిక కార్యకర్త చుక్క గంగారెడ్డితో పాటు పలువురు ప్రజాసంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు సంతాపం తెలిపారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

గొల్లపల్లి: కుటుంబ కలహాలతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై దత్తాద్రి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన అనంతుల రాకేశ్ (30)కు మమతతో పదకొండేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కూతుళ్లు పవిత్ర, ప్రజావి ఉన్నారు. రాకేశ్ నాలుగేళ్ల క్రితం దుబాయికి వెళ్లాడు. ఆరునెలల క్రితం తిరిగి స్వగ్రామానికి వచ్చాడు. అప్పటినుంచి భార్యాభర్తలు గొడవపడుతున్నారు. మంగళవారం రాత్రి రాకేశ్ భార్యతో మరోసారి గొడవపడ్డాడు. క్షణికావేశంలో భార్యను కత్తితో పొడిచి పారిపోయినట్లు సమాచారం. బుధవారం గ్రామశివారులోని ఓ చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని జగిత్యాల–నిజామాబాద్ ప్రధాన రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. జగిత్యాల రూరల్ మండలం.. చెల్‌గల్ గ్రామ శివారులోని ఓ హోటల్‌లో పనిచేస్తున్న సమీర్ అనే యువకుడు ద్విచక్రవాహనంపై పని నిమిత్తం జగిత్యాలకు వచ్చి చల్‌గల్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో స్వప్న దాబా సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో సమీర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108లో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌కు తరలించారు.

గీత కార్మికుడికి..

సుల్తానాబాద్ రూరల్(పెద్దపల్లి): తాటిచెట్టు పైనుంచి పడి, ఓ గీత కార్మికుడికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. సుల్తానాబాద్‌రూరల్ మండలంలోని నారాయణరావుపల్లికి చెందిన ఇల్లందుల సంపత్ రోజూ మాదిరిగా బుధవారం తాటి చెట్టు ఎక్కుతుండగాజారి పడ్డాడు. ఈ ఘటనలో అతనికి గాయాలవగా సర్పంచ్ మొలుగూరి వెంకటలక్ష్మి, వార్డు సభ్యులు గుర్రం మల్లేశం, బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మొలుగూరి ప్రశాంత్, నాయకులు అంజయ్యగౌడ్, సాయినాథ్‌లు కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మహిళను వేధించిన ట్రాన్స్‌కో ఉద్యోగి రిమాండ్

హుజూరాబాద్‌రూరల్: ఓ మహిళను వేధించిన ట్రాన్స్‌కో ఉద్యోగిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. గోదావరిఖనికి చెందిన మహిళ గత కొంతకాలంగా హుజూరాబాద్‌లో టైలరింగ్ చేస్తూ జీవిస్తోంది. ఈ క్రమంలో పెద్దపాపయ్యపల్లి గ్రామానికి చెందిన ట్రాన్స్‌కో ఉద్యోగి ఎండీ.షాబుద్దీన్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. షాబుద్దీన్ ఆమెకు మాయమాటలు చెప్పి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడు. అంతేకాకుండా సదరు మహిళ స్నానం చేస్తుండగా, రాత్రివేళల్లో వీడియోలు, ఫొటోలు తీశాడు. వాటిని సోషల్ మీడియాలో పెడతానని బ్లాక్ మెయిల్ చేసి, ఆమె వద్ద ఉన్న డబ్బులు తీసుకున్నాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. బుధవారం షాబుద్దీన్‌ను అరెస్టు చేసి, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. జడ్జి ఎదుట హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు ఎస్సై రాజన్న తెలిపారు.

లంచం కేసులో ఉద్యోగికి నాలుగేళ్ల జైలు

- నేరస్తుడు గతంలో వీఆర్వో.. ప్రస్తుతం జూనియర్ అసిస్టెంట్

కరీంనగర్ క్రైం: పేరు మార్పిడి కోసం రైతు వద్ద లంచం తీసుకుంటూ పట్టుబడిన కేసులో గతంలో వీఆర్వో, ప్రస్తుత జూనియర్ అసిస్టెంట్‌కు నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ కరీంనగర్ ప్రత్యేక ఏసీబీ కోర్టు న్యాయమూర్తి లక్ష్మీకుమారి తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల కేంద్రానికి చెందిన పెండ్యాల మహిపాల్ రెడ్డి అదే గ్రామానికి చెందిన ఇద్దరి వద్ద కొంత భూమిని కొనుగోలు చేశాడు. దాన్ని తనతోపాటు భార్య పేరిట రిజిస్ట్రేషన్ చేయించాడు. ఈ నేపథ్యంలో పేరు మార్పిడి కోసం తిమ్మాపూర్–1 వీఆర్వో నమిలికొండ వెంకటరమణకు సంబంధిత పత్రాలను ఇచ్చాడు. ఆయన ఎలాంటి పని చేయలేదు. తర్వాత అలుగునూరుకు బదిలీ అయ్యాడు. పత్రాలు వీఆర్వో వద్ద ఉండటంతో మహిపాల్ రెడ్డి వెళ్లి అడగగా రూ.5 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు 2013 ఏప్రిల్ 4న కరీంనగర్ ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. అదే నెల 6న ఉదయం వీఆర్వో వెంకటరమణ తన ఆఫీసులో మహిపాల్ రెడ్డి వద్ద లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అప్పటి సీఐ వీరభద్రం కేసు దర్యాప్తు జరిపారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన జడ్జి లక్ష్మీకుమారి వెంకటరమణకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు చెప్పారు. వెంకటరమణ ప్రస్తుతం పెద్దపల్లి డీపీవో ఆఫీసులో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.